# ప్రాజెక్టుల నిర్మాణంతో కరువు దూరం

- **దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి**
- **దేశంలోనే అభివృద్ధిలో గజ్వేల్ మోడల్**
- **గజ్వేల్ ప్రజాఆశీర్వాద సభలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్‌లో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/గజ్వేల్ అర్బన్/జగదేవ్‌పూర్/వర్గల్/ములుగు/మర్కూక్, నవంబర్ 28: గజ్వేల్ ప్రాంతంలో సీఎం కేసీఆర్ చేపట్టిన కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నిర్మాణంతో కరువు పోయిందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ రాకతోనే గజ్వేల్‌లో ప్రాజెక్టుల నిర్మాణం, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం,అటవీ కళాశాల, రింగ్‌రోడ్డు, కేజీ టూ పీజీ, ఐవోసీ భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామాల్లో ఫంక్షన్ హాళ్లు, మహిళా భవనాలు, డ్వాక్రా భవనాలు, డంపింగ్‌యార్డులు, గ్రేవ్ యార్డులు, ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసుకున్నామన్నారు. చెరువుల పునరుద్ధరణ చేసుకున్నామని, గోదావరి జలాలతో చెరువులు నిండుగా కనిపిస్తున్నాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో కుడవెల్లి, హల్దీవాగులు జీవనధులుగా మారాయన్నారు. సీఎం కేసీఆర్ ధైర్యవంతుడు కాబట్టే యాగాలు, యజ్ఞాలు చేయడం, యాదాద్రి ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కేసీఆర్ రాకతోనే పదేండ్లలో కరువు పోయిందని, ఎండాకాలంలో చెరువులు, చెక్‌డ్యామ్‌లు మత్తళ్లు దుంకుతున్నాయన్నారు. తెలంగాణలో అభివృద్ధి కేసీఆర్‌తోనే జరిగిందని, కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి నేడు మోడల్‌గా నిలుస్తుందన్నారు. రైతు బంధు, రైతుబీమా అమలు చేసి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కేసీఆర్ పాలన ఉందన్నారు. కల్యాణలక్ష్మి , షాదీముబారక్ తీసుకురావడంతో ప్రతి పేద కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. కులం, మతం పేరు చెప్పి బీజేపీ, కాంగ్రెస్ ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నాయని, అలాంటి అవకాశం వారికి ఇవ్వొద్దన్నారు. మనసుతో ఆలోచించి ప్రతి ఒక్కరూ తెలంగాణను అభివృద్ధి చేసిన కేసీఆర్‌కే ఓటు వేయాలన్నారు. మనం వేసే ఓటు తెలంగాణ ముఖ్యమంత్రికి వేస్తున్నామని, బీజేపీ, కాంగ్రెస్‌లకు వేస్తే దండుగే అవుతుందన్నారు. అసైన్డ్ భూములు తీసుకోమనే విషయాన్ని ఇక్కడికి వచ్చిన ప్రజలకు చెప్పాలన్నారు. నియోజకవర్గంలోని కొండపోచమ్మ, నాచారం దేవాలయాల అభివృద్ధికి కావాల్సిన నిధులు ఇవ్వాలన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఐటీ టవర్, జగదేవపూర్ మార్కెట్ యార్డు, గజ్వేల్‌కు స్పోర్ట్స్ స్టేడియం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, టెక్స్‌టైల్ పార్కులు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి కేసీఆర్‌కు ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను మూడోసారి గజ్వేల్ ప్రజలు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**కేసీఆర్ రాకతో ప్రశాంత జీవితం గడుపుతున్నాం**

పదేండ్ల క్రితం నియోజకవర్గ ప్రజలు రోజూ గొడవలతో పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగే వారని, కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలు ప్రశాంత జీవనం గడుపుతున్నామని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి అన్నారు. రైతుల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ధరణితో గ్రామాల్లో చాలావరకు భూసమస్యలు దూరమయ్యాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెవెన్యూ సమస్యలుపూర్తిగా పరిష్కారం అవుతాయన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు మేలు జరిగిందని, కేసీఆర్ వెన్నంటే ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



గజ్వేల్‌లో సభకు తరలివస్తున్న ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు

## జనసంద్రంగా గజ్వేల్

గజ్వేల్ అర్బన్, నవంబర్ 28: సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో గజ్వేల్ పట్టణం జనసంద్రంగా మారింది. మంగళవారం గజ్వేల్ ఐవోసీ పక్కన నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షుల ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ప్రజలే వేలాదిగా తరలిరాగా ఆయా గ్రామాల నుంచచి వచ్చిన జనంతో గజ్వేల్ ప్రధానదారులు గులాబీమయం అయ్యాయి. ఇక సభాస్థలిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా ఎంపీపీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు విజయ సంకేతం చూపుతూ జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. యువకులు పెద్దపెద్ద భవనాలపైకి ఎక్కి సీఎం ప్రసంగాన్ని విన్నారు.



గజ్వేల్ నుంచి సీఎం సభకు తరలివెళ్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు



విజయసంకేతం చూపుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

## కేసీఆర్‌కు ఘన స్వాగతం

**సీఎం సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు**

గజ్వేల్ అర్బన్, నవంబర్ 28: గజ్వేల్‌లో మంగళవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్‌కు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి ఘన స్వాగతం పలికారు. హెలీక్యాప్టర్ దిగిన కేసీఆర్‌కు ఎఫ్‌డీసీ చైర్మన్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకగా ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎన్సీ రాజమౌళి, కౌన్సిలర్లు లక్ష్మీకిషన్‌రెడ్డి, శ్యామలామల్లేశం, రాష్ట్ర యువత నాయకులు జుబేర్‌పాషా నమస్కారం చేస్తూ స్వాగతం పలుకగా సీఎం కేసీఆర్ పలుకరింపు నవ్వుతో ప్రతి నమస్కారం చేస్తూ ముందుకు సాగారు.



**సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కౌన్సిలర్లు, యువత నాయకుడు జుబేర్‌పాషా**

# కేసీఆర్ రాక.. గులాబీ కేక

- **జోష్ పెంచిన బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ప్రసంగం**
- **భారీగా తరలివచ్చిన ప్రజలు**
- **జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తిన గజ్వేల్**

గజ్వేల్/జగదేవ్‌పూర్, నవంబర్ 28: గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది. గజ్వేల్‌లో మంగళవారం నిర్వహించిన సభతో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో కనిపించారు. కేసీఆర్ రాక సందర్భంగా గజ్వేల్ పట్టణం ప్రజలతో కిక్కిరిసింది. అశేష జనవాహిని రాకతో గజ్వేల్ గులాబీమయంగా మారింది. ఉదయం నుంచి వాహనాల్లో వివిధ మండలాల నుంచి సభకు తరలివస్తూ కనిపించారు. వేలాదిగా తరలిరావడంతో సభ ప్రాంగణం జనసంద్రంగా మారింది. రోడ్డన్నీ బీఆర్ఎస్ కార్యకర్తలు, గులాబీ శ్రేణులతో సందడిగా కనిపించింది. కేసీఆర్ ప్రసంగంతో కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. సభ వేదికపై సీఎం కేసీఆర్ రాకతో ఈలలు, చప్పట్లు, పార్టీ జెండాల రెపరెపలతో జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తింది. కేసీఆర్ ప్రసంగం ప్రారంభమైనప్పటి నుంచి ముగింపు వరకు పార్టీ కార్యకర్తల నినాదాలతో సభ ప్రాంగణం మార్మోగింది. గజ్వేల్‌లో చేపట్టబోయే పరిశ్రమలు, ఐటీ టవర్ ఏర్పాటు, నిర్వాసితులకు ఉపాధి కల్పన గురించి వివరిస్తున్న సమయంలో యువకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఔర్ ఏక్ ధక్కా.. కేసీఆర్ పక్కా, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ వచ్చి వెళ్లేంత వరకు కళాకారులు సోమన్న, మధుప్రియా బృందం పాడిన రామక్క, తెలంగాణ పాటలకు డ్యాన్సులతో జోష్ కనిపించింది.

## దారులన్నీ గజ్వేల్ ప్రజా ఆశీర్వాద సభ వైపే..

గజ్వేల్/గజ్వేల్‌అర్బన్/జగదేవ్‌పూర్/ వర్గల్/ములుగు/మర్కూక్, నవంబర్ 28: ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగుస్తుండడంతో సీఎం కేసీఆర్ చివరి ఎన్నికల ప్రచారం గజ్వేల్‌లోనే నిర్వహించడంతో కేసీఆర్‌ను చూడాలని, ఆయన ప్రసంగం వినాలని నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నాయకులు, కార్యకర్తలు, చిన్నా పెద్ద, ముసలి, ముతక అనే తేడా లేకుండా పెద్ద సంఖ్యలో సీఎం సభకు జేజేలు పలికారు. ఆటోలు, డీసీఎంలు, బస్సులతోపాటు వివిధ వాహనాల్లో సభకు చేరుకోవడంతో గజ్వేల్ రోడ్లన్నీ రద్దీగా మారాయి. దీంతో గజ్వేల్ పట్టణం గులాబీమయంగా మారింది. అన్ని మండలాల నుంచి వచ్చే వాహనాలు గజ్వేల్ సభ వైపు తరలాయి. సీఎం కేసీఆర్ సభకు కార్యకర్తలు, ప్రజలు ర్యాలీగా వచ్చారు. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. గజ్వేల్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన కార్యకర్తలు డప్పు చప్పుళ్లతో సభ ప్రాంగణం వైపు ఊరేగింపుగా వెళ్లారు. సభ ముగిసిన తర్వాత అంతే ఉత్సాహంతో గ్రామాలకు తిరుగు పయణమయ్యారు.

## సీఎం కేసీఆర్‌కు విల్లు, నాగలి బహూకరణ



**కేసీఆర్‌కు విల్లును బహుకరిస్తున్న ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్**



**సీఎంకు తిలకం దిద్దుతున్న ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ**

గజ్వేల్/జగదేవ్‌పూర్/కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 28: గజ్వేల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు, కరచాలనం చేసేందుకు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు పోటీ పడ్డారు. సభ ప్రారంభ సమయంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జుబేర్ దట్టి కట్టారు. చివరలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ విల్లు, నాగలిని బహూకరించి ఆశీర్వాదం తీసుకున్నారు. సభ వేదిక నుంచి కేసీఆర్ వెళ్లే సమయంలో కరచాలనం చేశారు. ప్రజాఆశీర్వాద సభకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, రవీందర్‌రావు, జుబేర్‌లు ఘనంగా స్వాగతం పలికారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు సీఎం కేసీఆర్ వెంట ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. సభ ప్రాంగణంలో యువకులు జైకేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్న సమయంలో వారిని సముదాయించు ప్రతాప్ అంటూ కేసీఆర్ చెప్పారు. గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధిని ప్రతాప్ వివరించారంటూ సీఎం తన ప్రసంగాన్ని ప్రారంభించారు.